సాక్షి ఒడిశా

మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,58,959లు, బంగారం 1గ్రాము 600 మిల్లీగ్రాము, వెండి 21గ్రాముల 600 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



నేడు రత్నాభరణాల తరలింపు

పూరీ జగన్నాథుని రత్నాభరణాలను నేడు తరలించనున్నారు. ముహూర్తం ఖరారు చేశారు.

- IIలో▸



రథయాత్ర ప్రారంభం

విరజా మాత్ర రథయాత్ర ప్రారంభమైంది. సింహధ్వజ రథం తిరుగాడింది.

IIలో▸

న్యూస్‌రీల్

కొరాపుట్-రాయగడ మధ్య తెగిన సంబంధాలు



కొరాపుట్-రాయగడ జిల్లాల మధ్య బంగ్లాగుడ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

కొరాపుట్: కొరాపుట్–రాయగడ జిల్లాల మధ్య రాకపోకలు తెగి పోయాయి. సోమవారం సాయంత్రం జాతీయ రహదారి –326పై బంగ్లా గుడ వద్ద ఒక్క సారిగా వరద నీరు పోటెత్తింది. దీంతో వాహనాలు నిలిచిపోయాయి. ఈ మార్గంలో వంతెన నిర్మాణం కొనసాగుతోంది. తాత్కాలిక సర్వీస్ రోడ్ కూడా వరద నీరుతో నిండిపోయింది.

బొలొంగా బాలిక ఆత్మాహుతికి పాల్పడింది: సీఎం

భువనేశ్వర్: రాష్ట్రంలో తీవ్ర కలకలం రేపిన పూరీ జిల్లా నిమాపడా నియోజక వర్గం బొలొంగా ప్రాంతం నువాగోపాలపూర్ గ్రామంలో మైనరు బాలిక దహనం సంఘటనపై సభలో వాస్తవాల్ని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సోమవారం ప్రవేశ పెట్టారు. ఈ సంఘటనలో బాధితురాలు తన మరణ ప్రకటనలో తాను స్వయంగా నిప్పు అంటించుకున్నట్లు మరణ వాంగ్మూలం ఇచ్చినట్లు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి రాష్ట్ర శాసన సభకు తెలియజేశారు. విపక్ష బిజూ జనతా దళ్ సభ్యుడు అనంత నారాయణ ప్రశ్నకు ముఖ్యమంత్రి లిఖితపూర్వకంగా ఈ వివరణని సభలో ప్రవేశ పెట్టారు. అధికారిక రికార్డుల ప్రకారం ఈ ఏడాది జూలై 19న , 2025న బొలొంగా పోలీస్ ఠాణాలో గుర్తు తెలియని వ్యక్తులు తన కుమార్తెను బలవంతంగా నది ఒడ్డుకు తీసుకెళ్లి, ఆమెపై కిరోసిన్, పెట్రోల్ పోసి చంపడానికి ప్రయత్నించారని ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. స్థానిక గ్రామస్తులు ఆ యువతిని తీవ్రంగా కాలిన స్థితిలో కనుగొని పిప్పిలి ఆస్పత్రికి తరలించారు. తర్వాత ఆమెను అదే రోజు భువనేశ్వర్ ఎయిమ్స్‌కు తరలించారు. జూలై 20న రాష్ట్ర ప్రభుత్వం ఆమెను మెరుగైన చికిత్స కోసం ఢిల్లీలోని ఎయిమ్స్‌కు విమానంలో తరలించడానికి ఏర్పాట్లు చేసింది. దాదాపు రెండు వారాలు ఇంటెన్సివ్ కేర్‌లో ఉన్నప్పటికీ ఆగస్టు 2న గాయాలతో మరణించింది. ఆమె మరణానికి ముందు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 183 కింద సాకేత్ (న్యూఢిల్లీ) సౌత్ డిస్ట్రిక్ట్ కోర్టు ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేసింది. ఈ ప్రకటనలో, బాధితురాలు తాను కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నట్లు ప్రకటించింది. మరణ వాంగ్మూలం, అనుబంధ ఆధారాల ఆధారంగా బొలొంగా ఠాణా పోలీసులు తమ దర్యాప్తును ముగించి ఈ నెల 17న బీఎన్ఎస్ సెక్షన్ 127(2), 109, 123(3)(5) కింద కోర్టుకు తుది నివేదికను సమర్పించారు.

ఏడో రోజు సభ 7 నిమిషాలు మాత్రమే



సభ వాయిదా ప్రకటించిన స్పీకర్ సురమా పాఢి



ప్లకార్డులతో కాంగ్రెస్ సభ్యుల నిరసన

భువనేశ్వర్: శాసన సభ సమావేశాల్లో సోమవారం పంచాయతీ రాజ్ వ్యవస్థ కింద ప్రజా ప్రతినిధుల అధికారాలను కుదించడాన్ని నిరసిస్తూ ప్రతిపక్ష బిజూ జనతా దళ్ సభ్యులు ప్లకార్డులు, పోస్టర్లను పట్టుకుని నినాదాలు చేశారు. బీజేడీ, బీజేపీ భాయ్ భాయ్ పోస్టర్లను చూపిస్తూ కాంగ్రెస్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ప్రశ్నోత్తరాల ఆరంభానికి ముందు నుంచే ఈ పరిస్థితి రగిలింది. సభా కార్యకలాపాల నిర్వహణ అసాధ్యంగా భావించిన స్పీకరు సురమా పాఢి వాయిదా వేసినట్లు ప్రకటించారు. దీంతో సభ ఉదయం పూట సమావేశం కేవలం 7 నిమిషాలకు పరిమితమై సాయంత్రం 4 గంటల వరకు వాయిదా వేశారు. ఆ తర్వాత అదే పరిస్థితి కొనసాగడంతో శూన్య కాల చర్చలకు గండి పడింది.

బీజేపీ, బీజేడీ కుట్ర : తారా ప్రసాద్ బాహినీపతి

శాసన సభలో వర్షాకాలం సమావేశాలు తొలి రోజు నుంచి నిరవధికంగా వాయిదా పడుతున్నాయి. స్పీకర్ అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయకపోవడం విచారకరమని జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహినీపతి ఆవేదన వ్యక్తం చేశారు. సభ ఏకాభిప్రాయంతో ముందుకు సాగడానికి ఒక మార్గాన్ని కనుగొనాలి. చర్చలను నివారించడానికి ఉభయ అధికారి, విపక్షాలు భారతీయ జనతా పార్టీ, బిజూ జనతా దళ్ ఉద్దేశపూర్వకంగా సభా సమావేశాలు అడ్డుకుంటున్నాయని ఆయన ఆరోపించారు.

సభ సజావుగా సాగితే కాంగ్రెస్ ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై చర్చపై స్పీకర్ వైఖరి స్పష్టం చేయాల్సి ఉంటుంది. చర్చకు స్పీకర్ ఆమోదిస్తే విపక్ష హోదాలో బిజూ జనతా దళ్ వైఖరి పట్ల ముసుగు తొలగిపోతుంది. సభలో అధికార బీజేపీ సత్తా బట్టబయలు అవుతుంది. ఈ వాస్తవాలను తుంగలో తొక్కి ఏందుకు ఉభయ బీజేపీ, బీజేడీ కుట్ర పన్ని సభలో చర్చలకు అంతరాయం కలిగించి వాయిదా ప్రేరేపిస్తున్నారు.

స్పీకర్ చేయూత

మునుపటి సభా సమావేశాల్లో కాంగ్రెస్ మహిళల అంశాన్ని లేవనెత్తి ప్రత్యేక సభా కమిటీ ఏర్పాటు చేయాలని పట్టుబట్టింది. ప్రభుత్వ వైఖరికి నిరసనగా సభ్యులు సభలో ఘంటానాదం చేశారు. సభా సమావేశ ప్రాంగణం ఘంటా నాదంతో మారు మోగింది. అలాంటి పరిస్థితుల్లో స్పీకర్ సభను వాయిదా వేయకుండా నిరవధికంగా కొనసాగించారు. ఇప్పుడు నిమిషాల్లో సభను తరచూ వాయిదా వేస్తూ బీజేపీ, బీజేడీ లోపాయికారీ మైత్రికి చేయూతనిస్తున్నారని వేలెత్తి చూపుతున్నారు.

అసెంబ్లీ సజావుగా నడపాలి: ప్రసన్న ఆచార్య

ప్రభుత్వం అసెంబ్లీని నడపడంలో విఫలమైందని విపక్ష బిజూ జనతా దళ్ సభ్యుడు డాక్టర్ ప్రసన్న ఆచార్య అన్నారు. సభ సజావుగా సాగాలని బీజేడీ కోరుకుంటోంది. ఈ మేరకు అధికార పక్షం భారతీయ జనతా పార్టీ ప్రధాన బాధ్యత వహించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం చర్చకు అవకాశం కల్పించడం లేదు. ప్రభుత్వ మనస్తత్వం అర్థం కావడం లేదు. ఎరువులు సకాలంలో అందుబాటులో లేకపోవడం, మహిళలపై దారుణాలు పెరగడం ఆందోళనకర పరిస్థితుల్ని ప్రేరేపిస్తున్నాయి. ఈ పరిస్థితులపై సభ స్పందించాల్సిన అవసరాన్ని గుర్తించి సజావుగా నడిపించే బాధ్యతని అధికార పక్షం స్వీకరించాల్సి ఉందన్నారు.

కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం
స్పీకర్ తిరస్కరణ



శాసన సభ ప్రాంగణం మహాత్మా గాంధీ బొమ్మ వద్ద కాంగ్రెస్

భువనేశ్వర్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి నేతృత్వంలో కొనసాగుతున్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని శాసన సభ స్పీకర్ సురమా పాఢి తిరస్కరించారు. సోమవారం నాటి వర్షాకాలం సమావేశాల్లో మధ్యాహ్నం పూట స్పీకర్ అవిశ్వాస తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. తక్షణమే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సభలోని వెల్‌లోకి దూసుకెళ్లి, స్పీకర్ తిరస్కరణను నిరసిస్తూ గందరగోళం సృష్టించారు. తర్వాత వారు సభ నుంచి వాకౌట్ చేసి అసెంబ్లీ ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహం ముందు ధర్నాకు దిగారు. ఈ నెల 18న మోహన్ చరణ్ మాఝి నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం వ్యతిరేకంగా 15 మంది సభ్యుల మద్దతుతో కాంగ్రెస్ పార్టీ అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించింది. అసెంబ్లీ కార్యదర్శి సత్యబ్రత రౌత్ ద్వారా స్పీకర్ సురమా పాఢికి లేఖను సమర్పించారు. ఈ విషయంపై నోటీసు అందిన ఒక రోజు తర్వాత సభలో అవిశ్వాస తీర్మానాన్ని తీసుకురావాలని స్పీకర్ ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ఈ నెల 18 నుంచి ప్రారంభమై 25 వరకు కొనసాగే వర్షాకాల సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరు కావాలని కాంగ్రెస్ పార్టీ తన సభ్యులకు మూడు పంక్తుల విప్ జారీ చేసింది. వర్షాకాలం సమావేశాలు ఆరంభం నుంచి విపక్షాలు రేపుతున్న గందరగోళ పరిస్థితుల మధ్య సభ నిరవధికంగా వాయిదా వేయాల్సి వస్తుంది. సభలో ప్రశ్నోత్తరాలు, శూన్య కాలం చర్చ వంటి కీలక కార్యకలాపాలకు తీవ్ర గండి పడింది. ఈ నేపథ్యంలో కాంగ్రెసు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం తిరస్కరించడం అనివార్యమైనట్లు స్పీకరు సురమా పాఢి ప్రకటించారు. భగ్గుమన్న కాంగ్రెస్ సభ నుంచి వైదొలగి గాంధీ బొమ్మ సాక్షిగా నిరసన ప్రదర్శనకు దిగింది.సభ్యుల నిరసన ప్రదర్శన

చెట్టునీడే అంగన్‌వాడీ కేంద్రం!



చెట్టుకింద భోజనాలు చేస్తున్న చిన్నారులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి లులేరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి భవనం లేదు. దీంతో సిబ్బంది చెట్టు కిందనే పిల్లలకు బోధన చేయిస్తున్నారు. అలాగే అక్కడే చిన్నారులు భోజనాలు చేస్తున్నారు. లులేరు పంచాయతీలో గతంలో ఒకే అంగన్‌వాడీ కేంద్రం ఉండేది. అయితే పిల్లల సంఖ్య పెరగడంతో 2022లో రెండో కేంద్రాన్ని అధికారులు మంజురు చేశారు. భవనాన్ని కూడా కేటాయించి పనులు ప్రారంభించినప్పటికీ ఇప్పటికీ పూర్తి కాలేదు. దీంతో ఓ చెట్టుకిందనే అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లలకు బోధన చేయిస్తున్నారు. వర్షం వస్తే అంగన్‌వాడీ సహాయకురాలి ఇంట్లో కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బాలల సంరక్షణపై వర్క్‌షాపు



జిల్లా స్థాయి వర్క్‌షాపులో పాల్గొన్న పీఆర్‌ఐ సభ్యులు, సర్పంచులు, జెడ్పీటీసీలు

పర్లాకిమిడి: బాలల సంరక్షణపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై పంచాయతీ రాజ్ ప్రతినిధులు, ఎన్జీఓ సంస్థల అధికారులను జిల్లా అదనపు మేజిస్ట్రేట్ ఫల్గుణి మఝి సలహా కోరారు. స్థానిక జిల్లా సమగ్ర గిరిజనాభివృద్ధి శాఖ కాన్ఫరెన్స్ హాల్‌లో బాలల సంరక్షణపై వర్క్‌షాపులో ఏడీఎం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రేమ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు డాక్టర్ జాకబ్ తూండియాల్, జిల్లా శిశు సంరక్షణ అధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి, గుమ్మాసమితి చైర్మన్ సునేమీ మండళ్, ఎడ్యుకో కంట్రీ డైరక్టర్ గురుప్రసాద్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీపీయూ అరుణ్ కుమార్ త్రిపాఠి మాట్లాడుతూ, జిల్లాలో బాలకార్మికులు, బాలికలను అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలించడం, బాలికలపై లైంగిక దాడులు వంటివి బాలల హక్కులు హరించి వేస్తున్నాయని, అందు వల్ల పంచాయతీ రాజ్ ప్రతినిధులు పంచాయతీల్లో బాలల సంరక్షణకు పలు సమావేశాలు ఏర్పాటుచేయాలని సూచించారు. ప్రభుత్వం అనేక పథకాలు బాలల కోసం అమలు చేస్తోందని తెలిపారు. సెంటర్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యదర్శి అడ్డాల జగన్నాథ రాజు, స్వాస్ అధ్యక్షులు డి.జగన్నాథ రాజు తదితరులు మాట్లాడారు. ఈ కర్మశాల ప్రేమ్ స్వచ్ఛంద సంస్థ, ఎడ్యుకో, జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో జరగ్గా పర్యవేక్షకులుగా సుధీర్ కుమార్ దిగాల్, పీఆర్ఓ రథన్ మిశ్రాలు వ్యవహరించారు.



మాట్లాడుతున్న డీసీపీయూ అరుణ్‌కుమార్ త్రిపాఠి

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



రాయగడ: సునాభెషాలో మజ్జిగౌరి అమ్మవారు



రాయగడ: ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు



రాయగడ: చెక్కాగుడలో పూజలు ప్రారంభం



పర్లాకిమిడి: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు

పర్లాకిమిడి: దేవీ నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి వైభవంగా ఆరంభమయ్యాయి. పర్లాకిమిడిలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ప్రధాన పూజారి వనమాలి మణిశర్మ ఆధ్వర్యంలో మహిళచే సామూహిక కుంకుమ పూజలు జరిపించారు. తొలిరోజున పాతపట్నానికి చెందిన ఎరుకోల క్రిష్ణారావు, చంద్రమతి దంపతులు, మోనంగి రమేష్ దంపతులు చండీయోగంలో కూర్చున్నారు. కాత్యాయినీ దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. పర్లాకిమిడి పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠికి ప్రధాన పూజారి మణిశర్మ దుశ్శాలువతో సన్మానించారు. కళింగ వైశ్య సంఘం అధ్యక్షులు వైశ్యరాజు బాలజీరాజు, పొట్నూరు రామ తదితరులు విచ్చేశారు.

బాలసదన్‌లో..

స్థానిక అంకావీధి బాలసదన్ ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో శరనవరాత్రుల సందర్భంగా దుర్గాదేవిని ప్రతిష్ఠించి మహిళలచే సామూహిక కుంకుమ పూజలను భాస్కరభట్ల రవిప్రసాద్ శర్మ, జోస్యుల ప్రదీప్ శర్మలు చేయించారు. విజయదశమి వరకూ కుంకుమ పూజలు, కళశ పూజలు జరుపుతామని రవిప్రసాద్ శర్మ తెలిపారు.



పర్లాకిమిడి: కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ లెంక మధు దంపతులు



పర్లాకిమిడి: పురపాలక చైర్మన్ నిర్మలా శెఠితో పూజలు జరిపిస్తున్న వనమాలి మణిశర్మ పంతులు

దేవీ నవరాత్రులు ప్రారంభం

రాయగడ: దసరా ఉత్సవాల్లో భాగంగా దేవీ నవరాత్రులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవార్లు ప్రత్యేక అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా పూజలు అందుకుంటున్న మజ్జిగౌరి అమ్మవారు సునాభెషాలో దర్శనం ఇచ్చారు. ఏటా దసర, అమ్మవారి చైత్ర పండగల్లో మాత్రమే ఈ సునాభెషాలో దర్శనభాగ్యం కల్పిస్తారు. స్థానిక రాణిగుడఫారంలో పైడితల్లి అమ్మవారు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అదేవిధంగా స్థానిక చెక్కాగుడలొ దేవీ నవరాత్రుల్లో భాగంగా దుర్గా అమ్మవారి పూజలు ప్రారంభమయ్యాయి.



నబరంగ్‌పూర్‌లో సిద్ధమైన మా బండారు ఘరణి దేవాలయం

బండారు ఘరణి శక్తి పీఠంలో..

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలోని ఏకైక శక్తి పీఠం మా బండారు ఘరణి శక్తి పీఠంలో దసరా శరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం సాయంత్రం మందిరంలో ఉంచిన రాచ ఖడ్గాన్ని గిరిజన పూజారుల వెలికితీశారు. భారీ ర్యాలీతో ఈ ఖడ్గాన్ని ఊరేగించారు. ర్యాలీ వెంబడి యువకులు అఖండ ఆయుధ ప్రదర్శన నిర్వహించారు. మేళ తాళాలు, గిరిజన నృత్యాలతో ర్యాలీ కొనసాగింది. పురాతన ప్రతాప్ సాగర్ వద్ద ఆయుధాలను శుభ్ర పరిచి పూజలు చేశారు. వాటిని మందిర ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. అనంతరం దసరా శరన్నవ రాత్రులు ప్రారంభం అవుతున్నట్లు పూజారులు ప్రకటించారు. అప్పటికే సిద్ధమై ఉన్న నవ రాత్రి కాషాయదారులు నినాదాల మధ్య అఖండ దీపారాధన ప్రారంభమైంది.



సాగర్ వద్ద అమ్మవారికి పూజలు చేస్తున్న పూజారులు



అఖండ ఆయుధ ప్రదర్శన



జయపురం: శరవన్నవరాత్రుల సందర్భంగా పూజలందుకుంటున్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి

జయపురంలో దసరా ఉత్సవాలు



దసరా వేడుకల సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్న అమితాబచ్చన్ డూప్



బోలీవుడ్ ప్లే బ్యాక్ సింగర్, ఇండియన్ ఐడల్-15 టాపర్ మానసి ఘోష్

జయపురం: పట్టణంలో సోమవారం సాయంత్రం నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 27వ తేదీ నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు జయపురం దసరా ఉత్సవ కమిటీ నిర్ణయించినట్లు కమిటీ అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహినీపతి తెలిపారు. 27 నుంచి అక్టోబర్ 1 వరకు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఇండియన్ ఐడల్–15 విజేత మానసి గానాలాపన, కటక్ ఆర్కెస్ట్రా, ఓలీవుడ్ ప్లేబేక్ సింగర్ అంత్ర చక్రవర్తి గ్రూపుతో సంగీత కచేరీ ఉంటుందని తెలిపారు. రోజుకో ప్రదర్శనలు ఉంటాయని, ముఖ్య అతిథులు వస్తారని తెలిపారు.

శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో..

జయపురం: జయపురం మహారాణిపేటలో వేంచేసి ఉన్న వైశ్యుల ఆరాధ్య దైవం కన్యకాపరమేశ్వరి ఆలయంలో దసరా ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. నవరాత్రుల మొదటి దినమైన సోమవారం అఖండ జ్యోతిని వెలిగించి మండపు పూజలు జరిపి శరన్నవ రాత్రుల పూజలకు శ్రీకారం చుట్టారు.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య



మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు

రాయగడ: ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానిక ఇందిరానగర్ నాలుగో లైన్‌లో సోమవారం చోటు చేసుకుంది. మృతురాలు గొపాల్ పటకండ్ భార్య మమత చౌదరి (47)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న సదరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. ఇంటిలో తన గదిలో లోపల నుంచి తలుపులు వేసుకుని చీర సహాయంతో ఉరి వేసుకుంది. కుటుంబీకులు తలుపులు విరగొట్టి చూడగా మమత ఉరివేసుకుంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

స్కాలర్‌షిప్‌ల కోసం పరీక్ష నిర్వహణ



ఖోయిర్‌పూట్ సమితిలో పరీక్ష కోసం వచ్చిన విద్యార్థులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లాలో ప్రాథమిక విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల కోసం ఎంపిక పరీక్షను సోమవారం నిర్వహించారు. ముందుగా కటక్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదే సమయంలో జిల్లాలోని ఏడు సమితుల్లో పరీక్షను నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి చిత్తరంజన్ పాణిగ్రాహి పర్యవేక్షణలో 15 కేంద్రాల్లో పరీక్షను నిర్వహించగా.. 3,200 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రతిభ కనబర్చినవారు స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యే అవకాశం ఉందని జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు.

బకాయిలు చెల్లించాలి



ఆందోళన చేస్తున్న మహిళా ఉద్యోగులు

రాయగడ: గత ఆరు నెలలుగా తమకు బకాయిలు చెల్లించడం లేదని ఎంబీకే, సీఆర్పీ, బ్యాంకు మిత్రా ఉద్యోగులు సోమవారం జిల్లాలోని గుణుపూర్ సమితి కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. నెలవారి జీతాలు నిర్దిష్టమైన సమయంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బీడీఓకు మహిళా ఉద్యోగులు వినతిపత్రం అందించారు.

అథ్లెటిక్స్ క్రీడాకారుల జాబితా విడుదల

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుల జాబితా ఖరారైంది. ఇటీవలి శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశారు. అండర్–14, అండర్–16, అండర్–18, అండర్–20 నాలుగు వయో విభాగాల్లో 80 మంది బాలబాలికలను వేరువేరుగా ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారుల జాబితాను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు, ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి విడుదల చేశారు. క్రీడాకారుల బృందానికి కోచ్ మేనేజర్లగా ఇ.అప్పన్న, రామయ్య, చల్లారాజు వ్యవహరిస్తారని చెప్పారు.

27 నుంచి ఏలూరులో పోటీలు

ఇదిలా ఉండగా జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులంతా ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు ఏలూరు వేదికగా జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్–2025 పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులంతా ఈనెల 25వ తేదీన ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ వద్దకు తమ లగేజీతోపాటు టెన్త్‌క్లాస్ సర్టిఫికెట్/వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, మూడు పాస్ ఫొటోలతో చేరుకోవాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 85002 71575 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పాముకాటుతో విద్యార్థిని మృతి

నందిగాం: మండలంలోని మొండ్రాయివలసలో ఆదివారం అర్ధరాత్రి పాము కాటు వేయడంతో గ్రామానికి చెందిన సీపాన శ్రీనిధి (10) మృతి చెందింది. వివరాలను పరిశీలిస్తే గ్రామానికి చెందిన సీపాన శివ, పవిత్ర దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె రేష్మ, చిన్న కుమార్తె శ్రీనిధి. శ్రీనిధి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. ఆదివారం రాత్రి తల్లిదండ్రులతో కలిసి పడుకున్న శ్రీనిధికి అర్ధరాత్రి సమయంలో పాము కాటు వేసింది. కొద్దిసేపటికే శరీరంలో ఇబ్బంది కలగడంతో తల్లిదండ్రులకు తెలియజేసింది. దీంతో వీరు వేకువజామున టెక్కలి ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ విద్యార్థిని సోమవారం ఉదయం మృతి చెందింది. దీంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

నేడు ప్రధాన భాండాగారానికి

రత్నాభరణాలు తరలింపు

- సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిపివేత
- అమృత ఘడియల్లో తరలింపు

భువనేశ్వర్:

పూరీ శ్రీ జగన్నాథుని అమూల్య రత్న సంపదకు భద్రత నికరమైంది. భక్త జనుల దీర్ఘకాల నిరీక్షణకు తెరపడే శుభ ఘడియలు చేరువయ్యాయి. మరమ్మతు, పునరుద్ధరణ తర్వాత, రత్న భాండాగారం పూర్తిగా సిద్ధమైంది. ఇది కనీసం మరో 200 ఏళ్ల వరకు సురక్షితంగా ఉంటుందని భారత పురావస్తు శాఖ తెలిపింది. శ్రీ మందిరం పంచాంగ గణాంకాల ప్రకారం మంగళ వారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు అమృత ఘడియలు. ఈ నిడివిలో స్వామి అమూల్య రత్న సంపదని ప్రధాన రత్న భాండాగారానికి తరలించాలని నిర్ధారించినట్లు శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఏఓ డాక్టరు అరవింద కుమార్ పాఢి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అధ్యక్షతన అధికార వర్గాల సమావేశం సోమవారం ఆలయం కార్యాలయంలో జరిగింది. సమావేశంలో పూరీ జిల్లా కలెక్టర్, పోలీసు సూపరింటెండెంటు పాల్గొన్నారు.

మందిరంలో రత్న భాండాగారం మరమ్మతు, నిర్వహణ పనులు ముగిశాయి. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న శ్రీ జగన్నాథస్వామి ఆభరణాల జాబితా తయారీ, తరలింపు మంగళ వారం నుంచి ప్రారంభమవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఈ ప్రక్రియ ఈ నెల 23 ఉదయం 10 గంటల నుండి ప్రారంభం అవుతుంది. ఈ సందర్భంగా సాధారణ ప్రజలకు సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిపివేయనున్నారు. శ్రీ మందిరం నాట్య మండపం, జగమోహన్ మండపాలను శుభ్రపరచి రత్న భాండాగారానికి ఆభరణాలు తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

శ్రీ జగన్నాథ ఆలయం, ఊంజల మండపం ప్రాంగణంలోకి ప్రవేశం నిషేధించారు. రత్న భాండాగారం బదిలీ పూర్తయ్యే వరకు ఆంక్షలు అమలులో ఉంటాయి. అంతర్గత నిధుల జాబితాను 1978 నాటి జాబితా జాబితాతో సరిపోల్చుతారు. రత్న సంపద తరలింపు తర్వాత దర్శనం యథాతథంగా కొనసాగుతుంది. భక్తులు ఆనంద్ బజార్ నుంచి మహాప్రసాదం తీసుకోవచ్చు. భక్తులు సహకరించాలని ఆలయ నిర్వాహకులు కోరారు. రత్న భాండాగారం ఆభరణాల లెక్కింపు రాష్ట్ర ప్రభుత్వ జారీ చేసిన నిర్దిష్ట కార్యాచరణ విధానం (ఎస్‌ఓపీ) ప్రకారం జరుగుతుంది. దీని కోసం భారతీయ రిజర్వ్ బ్యాంక్ నుంచి 2 మంది సీనియర్ మరియు అనుభవజ్ఞులైన అధికారులను నియమించారు.



శ్రీ మందిరం సీఏఓ అధ్యక్షతన అధికార వర్గాల సమావేశం

గత ఏడాది రథ యాత్ర సమయంలో శ్రీ జగన్నాథస్వామి అమూల్య రత్న సంపద భద్రపరిచే రత్న భాండాగారం పునరుద్ధరణ, సంరక్షణ కోసం రత్న భండారాన్ని తెరవాలని పాలక మండలి నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం లభించడంతో పాలక మండలికి సహాయం చేయడానికి ఒడిశా హై కోర్టు విరామ న్యాయమూర్తి జస్టిస్ బిశ్వనాథ్‌రథ్ అధ్యక్షతన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసి సమగ్ర ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేసింది.

గత ఏడాది శ్రీ గుండిచా యాత్ర సందర్భంగా జూలై 14న సంధ్యా దర్శనం రోజున రత్న భాండాగారం తెరిచారు. అంచెలంచెలుగా వెలుపలి, లోపలి మిద్దెల నుంచి అన్ని ఆభరణాలు, సామగ్రిని తొలగించి ప్రధాన ఆలయం ప్రాంగణంలో చంగడ గృహానికి తరలించి తాత్కాలిక భద్రత కల్పించారు. గత ఏడాది జూలై 18న మేజిస్ట్రేట్ సమక్షంలో ప్రధాన రత్న భాండాగారానికి కేవలం 10 అడుగుల దూరంలో నిర్ధారించిన తాత్కాలిక భాండాగారానికి ఆభరణాలు, సామగ్రి తరలించడం పూర్తి చేశారు. ఈ సమగ్ర ప్రక్రియని నిర్వహణ కమిటీ అధీకృత సభ్యుల సమక్షంలో వీడియోగ్రాఫ్ చేశారు. అనంతరం రత్న భాండాగారం తాళం చెవిని ట్రెజరీలో భద్రపరిచారు. అనంతరం గత ఏడాది ఆగస్టు 23న రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రత్న భాండాగారం నుంచి తొలగించిన ఖాళీ బీరువాలు, చెక్క పెట్టెల్ని శ్రీమందిరం సముదాయం నీలాద్రి విహార్ మ్యూజియం సమీపంలోని గదిలో ఉంచారు.

రత్న భాండాగారం పూర్తి ఖాళీ కావడంతో ప్రధాన పనులు ప్రారంభించేందుకు భారత పురావస్తు శాఖ ప్రత్యక్షంగా రంగంలోకి దిగింది. సెప్టెంబర్ 18న రత్న భాండాగారం వాస్తవ స్థితిగతుల్ని ప్రాథమికంగా తనిఖీ చేసింది. సెప్టెంబర్ 21 మరియు 22 తేదీల్లో రెండు రోజుల పాటు ఏఎస్‌ఐ రత్న భాండాగారం యొక్క వివరణాత్మక శాస్త్రీయ మరియు సాంకేతిక సర్వేను నిర్వహించింది. ఈ సర్వేలో సందిగ్ధ, నిగూఢ నిధుల నిల్వ తదితర అంశాల్ని ధృవీకరించింది. అక్కడ నుంచి మర్మతు, నిర్వహణ, పునరుద్ధరణ పనులు ఊపందుకున్నాయి. గత ఏడాది డిసెంబర్ 17 నుండి ఈ పనులు నిరవధికంగా కొనసాగాయి. ఈ ఏడాది జూలై 7తో రత్న భాండాగారం పునరుద్ధరణ, మర్మతు పనులు పూర్తి అయినట్లు ఏఎస్‌ఐ ప్రకటించింది. ఈ లెక్కిన స్వామి రత్న భాండాగారం పరిరక్షణ కార్యకలాపాలు నిరవధికంగా 95 రోజుల పాటు దాదాపు 333 గంటల పాటు నిర్విరామంగా శ్రమించి పూర్తి చేసినట్లు అధికారికంగా ప్రకటించారు. ఇటీవల ఏర్పడిన పాలక మండలి రత్నభండార ఉప కమిటీ ఏర్పాటు చేసి మంగళవారం తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్ నుంచి భద్రపరచబడిన అన్ని ఆభరణాలు, సామగ్రిని రత్నభండారానికి తరలించాలని ఖరారు చేసింది.

అభివృద్ధిలో యువత పాత్ర కీలకం

జయపురం: ఉత్కళ కేశరి డాక్టర్ హరేకృష్ణ మెహతాబ్ కొత్తగా ఏర్పడిన ఒడిశా ప్రగతి కొరకు గురుత్‌పూర్ణ భూమిక నిర్వహించారని.. ఆయన బాటలో నేటి యువత గురుతరమైన పాత్ర పోషించాలని వక్తలు పిలుపునిచ్చారు. జయపురం విక్రమదేవ్ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ దేవీ ప్రసాద్ మిశ్ర ఆధ్వర్యంలో విశ్వ విద్యాలయంలో రెండు రోజులు నిర్వహించిన ఉత్కళ కేశరి డాక్టర్ హరేకృష్ణ మెహతాబ్ 125 జన్మవార్షిక స్మారక కార్యక్రమాల ముగింపు కార్యక్రమం ఆదివారం సాయంత్రం జరిగింది. విక్రమ విశ్వవిద్యాలయ ఒడిశా భాషా, సాహిత్య, సంస్కృతి విభాగం, హరేకృష్ణ మెహతాబ్ స్మృతి కేంద్రం సంయుక్తంగా రెండు రోజులు శిక్షణను నిర్వహించించారు. ముగింపు కార్యక్రమంలో దేవీ ప్రసాద్ మిశ్ర ప్రసంగిస్తూ.. మెహతాబ్ నేటి యువతకు ఆదర్శప్రాయులన్నారు. సమాజానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని చెప్పారు. కార్యక్రమంలో దేశీయ రాజ్య మిశ్రణ నవ ఉత్కళ నిర్మాత డాక్టర్ హరేకృష్ణ మెహతాబ్'అన్న శీర్షికపై చర్చ నిర్వహించారు. సిహెచ్ శాంతాకర్, డాక్టర్ ప్రదోష్ కుమార్ రథ్, డాక్టర్ కమల కుమార్ మహంతిలు చర్చలలో పాల్గొన్నారు. 'ఒడియా పాత్రికేయ రంగంలో హరేకృష్ణ మెహతాబ్'అనే అంశంపై జరిగిన చర్చావేదికలో విశ్వవిద్యాలయ పరీక్షల అధికారి రంజన్ ప్రదాన్, సచిన్ నాయిక్, కెప్టెన్ డాక్టర్ రమణ పాత్రో, డాక్టర్ దేవదత్ ఇండోరియ, డాక్టర్ సాగరిక మిశ్ర మాట్లాడారు. విశ్వవిద్యాలయ రిజస్ట్రార్ మహేశ్వర నాయిక్, ప్రొఫెసర్ ఉపేంద్ర పాఢి, డాక్టర్ నీలాద్రినాథ్ దాస్, డాక్టర్ మనోరంజన్ ప్రధాన్ హాజరయ్యారు.



వేదికపై వైస్ చాన్స్‌లర్ దేవీప్రసాద్ మిశ్ర తదితరులు

మూతపడ్డ ప్రైవేటు డిగ్రీ కళాశాలలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ప్రైవేటు డిగ్రీ కాలేజీలు సోమవారం మూతపడ్డాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లా కేంద్రంతోపాటు నరసన్నపేట, టెక్కలి, పాతపట్నం, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం, ఆమదాలవలస తదితర ప్రాంతాల్లోని ప్రైవేటు కాలేజీల్లో తరగతులను రద్దుచేసి కాలేజీలను మూసివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో సీఎం, డిప్యూటీ సీఎం, విద్యాశాఖామంత్రిని పలుమార్లు కలిసినప్పటికీ న్యాయం జరగకపోవడంతో గత్యంతరంలేని పరిస్థితుల్లో కాలేజీల్లో క్లాసులను రద్దు చేయాలని నిర్ణయించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రభుత్వం స్పందించినవరకు కాలేజీల్లో క్లాసులను రద్దు చేయాలని నిర్ణయించినట్టు ఏపీ ప్రైవేటు డిగ్రీ కాలేజీల మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.జయరాం పేర్కొన్నారు. ప్రభుత్వం, విద్యాశాఖా మంత్రి వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.

నిర్వాసితుల మిగులు భూములు



అరణ్య రోదన..!

- వంశధార నిర్వాసితులకు తీరని అన్యాయం
- 20 ఏళ్ల క్రితం రిజర్వాయర్‌కు సర్వం త్యాగం
- మిగిలిన 2,200 ఎకరాల భూములకు వెంటాడుతున్న సమస్యలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయానికి దూరం

హిరమండలం:

వంశధార రిజర్వాయర్ కోసం సర్వం త్యాగం చేశారు వారు. కానీ రెండు దశాబ్దాలు దాటుతున్నా వారి త్యాగాలకు మాత్రం సరైన న్యాయం జరగడం లేదు. వారికి స్వాంతననిచ్చే నిర్ణయం రావడం లేదు. వంశధార రిజర్వాయర్‌కు సంబంధించి మిగులు భూముల విషయంలో ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా రాయితీ రావడం లేదు. వాటికి అన్నదాత సుఖీభవ పథకం వర్తించలేదు. చివరకు పంటలు పండించేందుకు ఎరువులు కూడా అందించడం లేదు. దీంతో వందలాది మంది రైతుల బాధలు వర్ణనాతీతం. 2005లో వంశధార ఫేజ్–2 రిజర్వాయర్ నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 2007 నుంచి హిరమండలం, కొత్తూరు, ఎల్ఎన్‌పేట మండలాల పరిధిలోని 10 వేల ఎకరాల భూమిని అధికారులు సేకరించారు. 2010లో సేకరణ పూర్తయ్యింది. నిర్వాసితులకు ప్రభుత్వం పరిహారం కూడా అందించింది. అయితే రిజర్వాయర్ నిర్మాణానికి ఇచ్చిన భూమి పోనూ.. మిగులు భూమి విషయంలో తలెత్తిన రెవెన్యూ సమస్యలను అధికారులు ఇంతవరకూ పరిష్కరించలేదు. అయితే చేతిలో భూమి ఉందన్న విషయమే తప్ప.. ఆ భూములకు సంబంధించి బ్యాంకు రుణాలు రావడం లేదు. విత్తనాలు ఇవ్వడం లేదు. అన్నదాత సుఖీభవ లాంటి సాగు ప్రోత్సాహం లేదు. ఎందుకంటే మిగులు భూమికి సంబంధించి ధ్రువపత్రాలు, రిజర్వాయర్ నిర్మాణానికి నిర్వాసితులు వదులుకున్న భూములతో లింకు కావడమే. రిజర్వాయర్ కోసం రైతుల నుంచి సేకరించిన భూములు, మిగులు భూములను విడగొట్టకుండా అప్పట్లో అధికారులు సాంకేతిక తప్పిదానికి పాల్పడ్డారు. ఆ శాపం ఇప్పుడు రైతులకు వెంటాడుతోంది.



మిగుల భూముల సమస్యపై జేసీకి వినతిపత్రం అందిస్తున్న నిర్వాసితులు

చాలా అన్యాయం



ఇంతకంటే అన్యాయం ఉంటుందా..?. రిజర్వాయర్‌కు భూములిచ్చాం. కొన్ని భూములు మిగిలాయి. వాటిపై ప్రత్యేకంగా హక్కు కల్పించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. కానీ అది తమ పని కాదన్నట్టు వ్యవహరిస్తోంది. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా కనికరించడం లేదు. కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలి.

– పెద్దకోట సాదుబాబు, నిర్వాసితుడు, పాడలి నిర్వాసిత గ్రామం

13 గ్రామాలదే సింహభాగం

హిరమండలం మండలం పాడలి, దుగ్గుపురం, తులగాం, పెద్దసంకలి, గార్లపాడు, చిన్నకొల్లివలస తదితర 13 గ్రామాల రైతులు వేలాది ఎకరాలను వంశధార ఫేజ్–2 రిజర్వాయర్ నిర్మాణానికి వదులుకున్నారు. రిజర్వాయర్‌లో సింహభాగం భూమి ఈ గ్రామాల వారిదే. ఆ సమయంలో రిజర్వాయర్ ఎగువున ఉన్న భూములను మిగులు భూములుగా గుర్తించారు. వాటిని రైతులకు విడిచిపెట్టారు. అయితే ఇక్కడ ఒక చిక్కొచ్చిపడింది. ఒకే సర్వే నంబర్, వెబ్‌ల్యాండ్‌లో ఉన్న భూమి రిజర్వాయర్‌కు ఇచ్చిన దాంట్లోనూ.. మిగులు భూమిగానూ ఉంది. అప్పట్లో రెవెన్యూ రికార్డులు విభజించకుండా పూర్తి చేశారు. దీంతో అదంతా రిజర్వాయర్ భూమి పరిధిలో ఉండడంతో దాదాపు 2,200 ఎకరాల మిగులు భూములకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి ఏ పథకమూ వర్తించడం లేదు. ఇలా పథకాలు దక్కని మిగులు భూములకు సంబంధించి పాడలిలో 264 ఎకరాలు, దుగ్గుపురంలో 180, అంతిలిలో 1,200, పెద్దసంకిలిలో 220, గార్లపాడులో 150, చిన్నకొల్లివలసలో 100 ఎకరాలు ఉన్నాయి. అయితే ఈ రైతులంతా తహసీల్దారు, జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్స్ సెల్‌లో వినతిపత్రాలు అందించుకోవడమే తప్ప సమస్యకు మాత్రం పరిష్కార మార్గం దొరడకం లేదు. అందువలన ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

న్యాయం జరుగుతుంది



వంశధార నిర్వాసితుల మిగుల భూముల సమస్య ఎప్పటినుంచో ఉంది. దీనిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయి. ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. తప్పకుండా ఉన్నతాధికారులు పరిష్కారం చూపుతారు. నిర్వాసితులకు న్యాయం జరుగుతుంది.

– ఎ.జోగారావు, తహసీల్దారు, హిరమండలం

మా గోడు పట్టదా..?



వంశధార ఫేజ్–2 రిజర్వాయర్ కోసం సర్వం త్యాగం చేశాం. కానీ మా త్యాగాలకు విలువ లేకుండా పోయింది. మిగులు భూముల సమస్యలు పరిష్కరించాలని గత 15 సంవత్సరాలుగా కోరుతూనే ఉన్నాం. కానీ మా గోడు వినిపించుకునే వారు కరువయ్యారు.

– గొర్లె చంద్రినాయుడు, నిర్వాసితుడు, దుగ్గుపురం నిర్వాసిత గ్రామం

విరజా మాత రథ యాత్ర ప్రారంభం



భువనేశ్వర్: అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటిగా పేరొందిన విరజా మాత పీఠ క్షేత్రం జాజ్‌పూర్‌లో నవ దినాత్మక రథ యాత్ర సోమవారం ప్రారంభమైంది. ఏటా పవిత్ర ఆశ్వయుజ శుక్ల పక్ష పాడ్యమి తిథి పురస్కరించుకుని ఈ యాత్ర నిర్వహిస్తారు. యాత్ర ఆరంభానికి ముందు రోజు మహాలయ నాటి రాత్రి యాత్రకు సర్వం సిద్ధం చేస్తారు. సింహ ధ్వజ రథంపై విమల దేవి యాత్ర జరుగుతుంది. మహా నవమి తిథి రథయాత్ర చివరి రోజు. యాత్ర కోసం రథాన్ని బ్రహ్మ విమలా దేవతకు అర్పించినట్లు పౌరాణిక కథనం ప్రచారంలో ఉంది. రథ సారథిగా బ్రహ్మ కొలువై ఉంటాడని పేర్కొంటారు. 12 చక్రాలతో 14 అడుగుల 4 అంగుళాల పొడవు, 11 అడుగుల 9 అంగుళాల వెడల్పు, 43 అడుగుల 16 అంగుళాల ఎత్తు కలిగి ఈ రథం నిర్మాణంలో 898 చెక్క ముక్కలను ఉపయోగిస్తారు.

లేకాపాయిలో మౌలిక సౌకర్యాలు కల్పించండి

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి మండిబిసి పంచాయతీలోని లేకాపాయి గ్రామంలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ అశుతోష్ కులకర్ణిని కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో తాగునీటి సమస్య వేధిస్తోందని, ఉన్న రెండు సోలార్ గొట్టపు బావులు పాడై నెలలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని కలెక్టర్‌కు వివరించారు. నది నుంచి నీరును తీసుకువచ్చి దాహార్తి తీర్చుకుంటున్నామని తెలియజేశారు. గ్రామానికి సరైన రహదారి లేక నానా అవస్థలు పడుతున్నామని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సౌకర్యాల కోసం పడుతున్న యాతన వర్ణనాతీతమని వివరించారు. పాఠశాల లేక విద్యార్థుల భవిష్యత్ అగమ్య గోచరంగా మారిందని చెప్పారు. సమస్యలు పరిష్కరించి గ్రామస్తులకు మేలు చేయాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.



కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన గ్రామస్తులు

గ్రీవెన్స్ సెల్‌లో 72 వినతుల స్వీకరణ



మల్కన్‌గిరి: మహిళ అందించిన వినతిని పరిశీలిస్తున్న కలెక్టర్ సోమేశ్ ఉపాధ్యాయ్



పర్లాకిమిడి: తలముండ పంచాయతీ వాసుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియా సమితి సిమిలిబంచ్ పంచాయతీలో సోమవారం జిల్లా కలెక్టర్ సోమేశ్ ఉపాధ్యాయ్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్‌సెల్‌ను నిర్వహించారు. ఈ వారం 72 వినతులను స్వీకరించారు. వీటిని కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించి కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటిపై విచారణ చేసి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ వినోద్ పటేల్, సబ్ కలెక్టర్ అశ్విని ఏ ఎల్, జిల్లా అభివృద్ధి శాఖ అధికారి నరేశ్ శభరో తదితరులు పాల్గొన్నారు.

తలముండలో 56 వినతులు..

పర్లాకిమిడి: జిల్లాలోని రాయఘడ బ్లాక్ తలముండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో జాయింట్ గ్రీవెన్సు సెల్‌కు జిల్లా కలెక్టర్ మధుమిత, జిల్లా ఎస్పీ జ్యోతింద్ర కుమార్ పండా, జిల్లా పరిషత్తు సీడీవో శంకర్ కెరకెటా, సబ్ కలెక్టర్ అనుప్‌పండాలు పాల్గొన్నారు. రాయఘడ బ్లాక్‌లోని డోంబాల్, జిరంగో, తలముండ గ్రామ పంచాయతీల నుంచి 56 వినతులు అందగా వాటిలో గ్రామసమస్యలకు సంబంధించినవి 29, వ్యక్తిగతం 27 ఉన్నాయి. ముఖ్యంగా సామాజిక పింఛన్లు, భూమి, ఇళ్లపట్టాలు, పీఎం ఆవాస్‌యోజన పథకం కోసం దరఖాస్తులు అందాయి. వాటిని త్వరితగతిన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. రాయఘడ సమితి అధ్యక్షురాలు పూర్ణబాసి నాయక్, ఉపాధ్యక్షులు జ్యోతి ప్రసాద్ పాణి, బీడీవో సంతోష్ కుమార్ నాయక్, సీడీఎంవో డాక్టర్ యం.యం.ఆలీ, బ్లాక్ స్థాయి ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



రాయగడ: వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ కులకర్ణి, ఎస్పీ స్వాతి

వినతుల వెల్లువ

రాయగడ: జిల్లాలోని బిసంకటక్‌లో సోమవారం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో జిల్లా కలక్టర్ అశుతోష్ కులకర్ణి పాల్గొని వినతుల స్వీకరించారు. సమితి పరిధిలో గల వివిధ ప్రాంతాలకు చెందిన 78 సమస్యలు కలక్టర్ దృష్టికి వచ్చాయి. 63 వ్యక్తిగత సమస్యలు, 7 గ్రామ సమస్యలు, 8 వైద్య సహకారానికి సంబంధించిన సమస్యలు గుర్తించారు. 8 మందికి వైద్య ఖర్చులకు సంబంధించి రూ.75 వేలను రెడ్ క్రాస్ నిధుల నుంచి మంజూరు చేశారు. ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, గుణుపూర్ సబ్ కలెక్టర్ దుదూల్ అభిషేక్ దిల్లిప్, గుణుపూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అజయ్ కుమార్ ప్రధాన్, జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ సరోజిని దేవి, తదితరులు పాల్గొన్నారు.

దారి ధ్వంసం

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా ఖోయిర్‌పూట్ సమితి బొండాఘాటీకి వెళ్లే మార్గంలోని మాంకడమొల రహదారిలో సోమవారం సాయంత్రం కొండల నుంచి వచ్చిన నీటికి రహదారి దిగువ భాగంలో మట్టి కరిగిపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న సమితి అధికారి ఉమాశంకర్ కోయ, తహసీల్దార్ ఇద్దరూ సంఘటన స్థలానికి చేరుకుని వానలు తగ్గే వరకు రహదారిని పూర్తిగా నిలిపివేస్తామన్నారు.



రహదారి దిగువ భాగంలో కరిగిన మట్టి



రహదారిలో అడ్డంగా రాళ్లు వేస్తున్న యువకులు



జలపాతం వద్ద నుంచి రాళ్లను తెస్తున్న యువత



కొండల పైనుంచి వస్తున్న వర్షపు నీరు

క్లుప్తంగా

సీతానగరంలో అగ్ని ప్రమాదం



మంటలు రేగుతున్న పెంకిటిల్లు

సీతానగరం: మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డులో ఉన్న ఏడిద శ్రీదేవి పెంకిటింట్లో సోమవారం సంభవించిన అగ్ని ప్రమాదంతో రూ. 2 లక్షల విలువైన ఆస్తి నష్టం వాటిల్లింది. బాధితురాలు శ్రీదేవి పెంకిటిల్లులో నివాసం ఉంటూనే కిరాణా షాపు నిర్వహిస్తున్నారు. రోజూలాగే సోమవారం కిరాణా షాపు తెరిచిన కొద్ది సేపటికే విద్యుత్ వైర్లు నుంచి మంటలు రావడం కనిపించని విధంగా పొగతో కూడిన మంటలు రావడంతో ప్రమాదం సంభవించింది. బొబ్బిలి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. అగ్ని ప్రమాదం సంభవించినట్టు తెలుసుకున్న మండల ఆర్ఐ నాగిరెడ్డి శ్రీనివాసరావు, వీఆర్వో పైల కుమార్ నాయుడు సంఘటనా స్థలాన్ని సందర్శించి ఆస్తి నష్టం అంచనా వేశారు. సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్టు తెలిపారు.

వినాయక ట్రేడర్స్‌పై కేసు నమోదు



వినాయక ట్రేడర్స్‌లో తనిఖీలు చేస్తున్న ఏవో, తహసీల్దార్, ఎంపీడీవో తదితరులు

సంతకవిటి: మండల కేంద్రంలోని ఓం శ్రీ వినాయక ట్రేడర్స్ దుకాణంపై ఈసీ యాక్ట్ 1966 ప్రకారం 6 ఏ కేసు నమోదు చేసినట్టు ఏవో సి.బి.యశ్వంత్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కలెక్టర్‌కు కొందరు రైతులు దుకాణంలో ఎరువులను ఎమ్ఆర్‌పీ కంటే అధిక రేట్లకు అమ్ముతున్నారని ఇచ్చిన ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ బి.సుదర్శనరావు, ఎంపీడీవో కె.సురేష్‌కుమార్, వీఆర్‌వో బుచ్చిబాబుల ఆధ్వర్యంలో సోమవారం దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో దాదాపు రూ.36 వేలు విలువ చేసే డీఏపీ, ఎమ్‌వోపీ, కాంప్లెక్స్ ఎరువుల్లో తేడాలున్నట్టు గుర్తించారు. దుకాణంలో రూ.13.23 లక్షల విలువ చేసే దాదాపు 46 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేసినట్టు ఆయన తెలిపారు.

రగ్బీ పోటీలకు బిళ్లలవలస విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పి.డి, ఉపాధ్యాయులు

మెరకముడిదాం: మండలంలోని బిళ్లలవలస జెడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్ – 14, అండర్ – 17 రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల గజపతినగరం మండలం మరుపల్లి జెడ్పీ పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి రగ్బీ పోటీల్లో పాఠశాలకు చెందిన అరసాడ గౌతమ్ అండర్-14 పోటీలకు, చోడవరపు కావ్య అండర్-17 పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో అధికారులు వీరిరువురిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం వై.సుచరిత, పాఠశాల పి.డి వి.వి.రమణారావు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

నిండు గర్భిణిని.. డోలీలో 8 కిలోమీటర్లు...



నయా గ్రామం నుంచి నిండుగర్భిణిని డోలీలో తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

కొమరాడ: గిరిజనులను డోలీ కష్టాలు వీడడం లేదు. గిరిశిఖర గ్రామాలకు రోడ్ల నిర్మాణంలో జాప్యం గిరిజనులకు శాపంగా మారింది. కొమరాడ మండలంలోని నయా గ్రామానికి చెందిన నిండుగర్భిణి కోలక బామిడమ్మకు సోమవారం ఉదయం పురిటినొప్పులు వచ్చాయి. గ్రామానికి వాహనం వెళ్లే దారిలేక పోవడంతో కుటుంబ సభ్యులు డోలీలో రాళ్ల దారిలో సుమారు 8 కిలోమీటర్ల దూరంలోని సీసాడ వలస వరకు తీసుకొచ్చారు. అక్కడ నుంచి 108లో వైద్యం కోసం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. గ్రామానికి రహదారి ఏర్పాటుకు నిధులున్నా అటవీశాఖ అధికారుల అనుమతి లేక ఆగిపోయింది. అటవీశాఖ నుంచి అనుమతులు తేవడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా గిరిజనులకు కష్టాలు తెచ్చిపెడుతోందని గిరిజన సంఘాల నాయకులు మండిపడ్డారు. గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్యే జగదీశ్వరి స్పందించి నయా, సంకేస్, దేరుపాడు లొద్ద, ఉల్లెంద్రి, ఉలిగేస్, తదితర గ్రామాలకు రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పూడేస్, కుంతేస్, మసిమండ, పెదశాఖ, గుణదతీలేస్, చోళ్లపదం తదితర పంచాయతీల ప్రజలకు కూడా అత్యవసర వేళ డోలీలే దిక్కవుతున్నాయని వాపోయారు.

- నమోదు కాని ఉమ్మడి ఖాతాలు
- అధికారుల మధ్య సమన్వయ లోపం
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతన్నలు

ఈ క్రాప్‌కు వెబ్‌ల్యాండ్ సమస్య

వీరఘట్టం: ఈ ఏడాది ఖరీఫ్‌లో వరిసాగు చేస్తున్న రైతులను ఆది నుంచి కష్టాలు వెంటాడుతునే ఉన్నాయి. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో అలస్యంగా ఖరీఫ్ పనులు ప్రారంభించారు.విత్తనాలు మొదలుకుని ఎరువులు సేకరించడానికి నానా యాతన పడుతున్న విషయం తెలిసిందే. పంట దిగుబడి వచ్చిన తర్వాత ఆ పంటను అమ్ముకోవాలంటే పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. అయితే కొందరి భూముల వివరాలు పక్కాగా ఉండడంతో అటువంటి వారి పంటల వివరాలు సక్రమంగా ఈ-క్రాప్‌లో నమోదవుతున్నాయి. ఇంకొందరు రైతులకు ఉమ్మడి ఖాతాలు ఉండడంతో వారి పేర్లు ఈ-క్రాప్‌లో నమోదు కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.ఈ సమస్యను సంయుక్తంగా పరిష్కరించాల్సిన వ్యవసాయ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం లోపంతో రైతులు చెప్పులరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 3.20 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేస్తున్నారు. ఇందులో వరి 1.65 లక్షల ఎకరాలు కాగా చెరకు, అరటి, ఇతర కాయగూరల పంటలు 1.55 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. పంటల దిగుబడి వచ్చేటప్పుడు ఆ పంటలను అమ్ముకోవడానికి ఈ-క్రాప్ నమోదు చేయాలి. వ్యవసాయ సహాయకులు తమ సచివాలయాల పరిధిలోని రెవెన్యూ గ్రామాలకు వెళ్లి పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయాలి.ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నాటికి 1.35 లక్షల ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తి చేశారు. ఇంకా 1.85 లక్షల ఎకరాల్లో నమోదు చేయాల్సి ఉంది. మిగిలిన పంటల వివరాలను నమోదు చేయడానికి సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



వీరఘట్టంలో ఈ-క్రాప్‌లో పంటల వివరాలు నమోదు చేస్తున్న ఏవో

వాటిని అధిగమించలేకపోవడంతో రైతులు ఈ-క్రాప్ నమోదుకు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

సుమారు 50 గ్రామాల్లో కష్టాలు

జిల్లా వ్యాప్తంగా సుమారు 50 గ్రామాల్లో ఈ-క్రాప్ సమస్య రైతులను వెంటాడుతోంది. ఈ-క్రాప్‌లో నమోదు చేయాలంటే కచ్చితంగా భూమల వివరాలు వెబ్‌ల్యాండ్‌లో కనిపించాలి. అయితే ఈ గ్రామాలకు సంబంధించిన వివరాలు కనిపించక ఈ-క్రాప్ నమోదు నత్తనడకన సాగుతోందని రైతులు అంటున్నారు. ముఖ్యంగా జాయింట్ అకౌంట్ ఉన్న రైతుల ఖాతాలను వేరు చేసి వారి పేర్లు వ్యవసాయశాఖ సైట్‌లో కనిపించేటట్లు చేస్తే ఈ-క్రాప్ నమోదు వేగవంతంగా పూర్తి చేస్తామని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

పది రోజులుగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు



వీరఘట్టం మండలంలోని బూరుగ గ్రామంలో జాయింట్ అకౌంట్‌లో ఉన్న 3.26 ఎకరాల భూమిని కౌలుకు సాగు చేస్తున్నాను. ఈ భూమికి సంబంధించి వన్‌బీ, అడంగల్ కాపీ వస్తోంది, అయితే వ్యవసాయ శాఖ అధికారుల లాగిన్‌లో ఈ భూమి వివరాలు కనిపించకపోవడంతో ఈ-క్రాప్ నమోదు కావడం లేదు. ఈ సమస్య పరిష్కారం కోసం పది రోజులుగా తిరుగుతున్నా, పరిష్కారం ఏమిటో ఎవరూ చెప్పడం లేదు.

– కిల్లారి శ్రీను, రైతు, వీరఘట్టం

ఆందోళన వద్దు



ఈ ఏడాది జిల్లాలో 3.20 లక్షల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు 1.35 లక్షల ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తి చేశాం.మరో 1.85 లక్షల ఎకరాల్లో నమోదు చేయాల్సి ఉంది. జాయింట్ అకౌంట్ ఉన్న రైతులు తమ పరిధిలో ఉన్న వీఆర్‌ఓను సంప్రదిస్తే ఆయన లాగిన్‌లో జాయింట్ అకౌంట్‌లో ఉన్న రైతుల భూమిని వేరు చేస్తారు. తర్వాత ఆ వివరాలు మండల వ్యవసాయశాఖ అధికారి లాగిన్‌కు వస్తాయి, ఏఓ లాగిన్‌లో జాయింట్ అకౌంట్ వివరాలను నిర్ధారిస్తారు. తర్వాత ఆ వివరాలు సచివాలయంలో ఉన్న వ్యవసాయ సహాయకుల లాగిన్‌కు వెళ్తాయి. రైతులు వ్యవసాయ సహాయకులను సంప్రదిస్తే ఈ-క్రాప్‌లో పంటల వివరాలను నమోదు చేస్తారు. దీని కోసం రైతులు ఆందోళన చెందవద్దు.

:కె.రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, పార్వతీపురం మన్యం

గిరిజన వారపు సంతల్లో వైద్య శిబిరాలు

- పార్వతీపురం సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి



పార్వతీపురం సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి

పార్వతీపురం టౌన్: పార్వతీపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని మారుమూల గిరిజన ప్రాంత ప్రజలకు వైద్య సదుపాయాలు అందించడానికి గిరిజన వా రపు సంతల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని పార్వతీపురం సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి వైద్యాధికారులను సోమవారం ఆదేశించారు. సంతలకు విచ్చేసే ప్రజల ఆరోగ్య అవసరాల దృష్ట్యా రక్త పరీక్షలు నిర్వహించాలని, అందులో వ్యాధులు గుర్తించిన పక్షంలో ఉచిత వైద్య సేవలు, మందులు అందించాలన్నది లక్ష్యమని ఆమె వివరించారు. అదే విధంగా మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా వంటి సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల్లో 10 సంత ప్రదేశాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆమె పేర్కొన్నారు. గ్రామ, మండల స్థాయిలో ముందుగానే సమాచారం ఇచ్చి రోగులు శిబిరాలకు హాజరయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ శిబిరాలను గిరిజన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా మాత్రమే కాకుండా, ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా వైద్య సిబ్బంది విస్తృత అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు.

డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో 'సరస్'



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ పాణి

- డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌పాణి

విజయనగరం టౌన్: శ్రీ పైడితల్లి అమ్మవారి పండగ, విజయనగర ఉత్సవాలను పురస్కరించుకుని సెర్ప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో సరస్ – 2025 పేరుతో అఖిల భారత డ్వాక్రా బజార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డీఆర్‌డీఏ పథక సంచాలకులు శ్రీనివాస్ పాణి పేర్కొన్నారు. సోమవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో డీపీఎం, ఏపీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ జంక్షన్ వద్ద గ్రాండ్ ట్రంక్ రోడ్డు పక్కన సరస్ నిర్వహిస్తున్నామన్నారు. సుమారు 250 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని, ఈ నెల 28 నుంచి అక్టోబరు 8వ తేదీ వరకూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణాతో పాటూ వివిధ రాష్ట్రాల నుంచి స్టాల్స్ ఏర్పాటు చేసి మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను అమ్మకాలు, ప్రదర్శన చేస్తారన్నారు. మున్సిపల్, పోలీస్, హార్టికల్చర్, ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, నాబార్డ్ ప్రభుత్వం శాఖలతో సమన్వయం, శానిటేషన్, మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు, మంచినీరు, భోజన, వసతి, సాంస్కృతిక కార్యక్రమాలపై సమీక్ష చేశారు. కార్యక్రమంలో అదనపు పథక సంచాలకులు కె.సావిత్రి ప్రాజెక్ట్ మేనేజర్ డి.రత్నాకర్, అకౌంట్స్ ఆఫీసర్ బివివిఎస్.దొర తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ చాంబర్‌లోనే ఫిర్యాదుల స్వీకరణ



ఫిర్యాదుదారుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైమ్: జిల్లాకు ఇటీవల కొత్తగా వచ్చిన ఎస్పీ ఏఆర్ దామోదర్ తన చాంబర్‌లోనే సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 31 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ఎనిమిది భూతగాదాలకు సంబంధించినవి కాగా, కుటుంబ కలహాలకు సంబంధించినవి నాలుగు, మోసాలకు పాల్పడినట్టు ఐదు, నగదు వ్యవహారాలకు సంబంధించి ఒకటి, ఇతర అంశాలకు సంబంధించి 13 ఫిర్యాదులు వచ్చాయి. అర్జీదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్‌బీ సీఐ ఏవీ లీలారావు, డీసీఆర్‌బీ సీఐ బి.సుధాకర్, ఎస్ఐ ప్రభావతి, సిబ్బంది పాల్గొన్నారు.

25న యూటీఎఫ్ రణభేరి

పార్వతీపురం టౌన్: ఉపాధ్యాయ సమస్యలపై ఈ నెల 25న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించనున్న యూటీఎఫ్ రణభేరి సభకు ఉపాధ్యాయులంతా తరలి రావాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు పిలుపునిచ్చారు. డీఈవో కార్యాలయం వద్ద రణభేరికి సంబంధించిన పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. రణభేరి జాతర సందర్భంగా యూటీఎఫ్ గుర్తించిన సమస్యలతో పాటు ఉపాధ్యాయులు కూడా వారి సమస్యలు రాష్ట్ర నాయకత్వానికి విజ్ఞాపనల రూపంలో అందజేశారని అన్నారు. వీటిని క్రోడీకరించి ఈ సభ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వద్ద తమ డిమాండ్లు ఉంచనున్నట్టు తెలిపారు. విద్యారంగంలో అనేక సమస్యలు పేరుకుపోయాయని ధ్వజమెత్తారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించడానికి నిరాకరిస్తుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర విద్యా విధానాన్ని ప్రకటించాలని యూటీఎఫ్ డిమాండ్ చేస్తోందన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్‌సీ కమిషన్‌ను తక్షణమే నియమించి మధ్యంత భృతిని ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, కె.భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



డీఈవో కార్యాలయం వద్ద రణభేరి పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

అథ్లెటిక్స్ టెక్నికల్ అఫీషియల్స్‌గా జిల్లా పీడీలు



ఎంపికైన పీడీలు

విజయనగరం గంటస్తంభం: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 23 నుంచి 25 వరకు జరగనున్న 36వ జాతీయ స్థాయి సౌత్‌జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా నుంచి ఐదుగురు పీడీలు టెక్నికల్ అఫీషియల్స్‌గా నామినేట్ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్ టెక్నికల్ కమిటీ చైర్మన్ హరిబాబు ఈ మేరకు ఎంపికైన వారికి సమాచారం అందజేశారు. జిల్లా నుంచి ఎంపికైన వారిలో వి.ఆనంద్‌కిషోర్, పి.లీలాకృష్ణ, జి.గురునాయుడు, ఎం.రామకృష్ణ, బి.ఎం.శ్రీకాంత్ ఉన్నారు. వీరిని జిల్లా అథ్లెటిక్స్ సంఘం, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం సభ్యులు అభినందించారు.

మరో 1.10 లక్షల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



అక్షర వాచకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి

- అక్షర వాచకం పుస్తక ఆవిష్కరణలో కలెక్టర్

విజయనగరం అర్బన్: జిల్లాలో మరో 1.10 లక్షల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ అక్షరాంధ్ర లక్ష్యమని కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అక్షర వాచకం పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఆర్‌డీఏ ద్వారా 60,715 మంది, మెప్మా ద్వారా 12 వేల మంది మహిళలను, డ్వామా ద్వారా 38,200 మంది పురుషులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. రానున్న మూడు నెలల్లో వంద గంటలు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కోర్స్ పూర్తి చేసిన వారికి నేషనల్ ఓపెన్ స్కూల్ ద్వారా ఎఫ్ ఎల్ అండ్ టీ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఆసక్తి గల నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా మారడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జేసీ ఎస్.సేతుమాధవన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, ఎస్డీసీలు వెంకటేశ్వరరావు, ఇ.మురళి, నూకరాజు, ప్రమీలగాంధీ, వయోజన విద్య నోడల్ అధికారి ఎ.వేణుగోపాల్, డీఆర్‌డీఏ, డ్వామా, మెప్మా పీడీలు శ్రీనివాస్, శారదాదేవి, చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ సమస్య పరిష్కారం కావాలి : కలెక్టర్



ఫిర్యాదుదారుల అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర్ రెడ్డి

పార్వతీపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతీ సమస్య పరిష్కారం కావాలని కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, డీఆర్‌వో కె.హేమలత, డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి భాగస్వామ్యంతో 280 వినతులను స్వీకరించారు. ఈ మేరకు కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తే పరిష్కారం జరుగుతుందన్న ప్రజల నమ్మకం మేరకు అధికారులు ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. ప్రతీ అర్జీని క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలు శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను చట్టపరిధిలో పరిష్కరించాలి : ఎస్పీ

నిర్దేశించిన సమయంలోనే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను చట్టపరిధిలో పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి సంబంధిత పోలీసు శాఖాధికారులకు స్పష్టం చేశారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. జిల్లాలో ఉన్న పలు స్టేషన్ల పరిధిలలో నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదు అంశాలు వాస్తవాలైతే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 13 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ ఆదాం, సీసీఎస్ సీఐ అప్పారావు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి ఫోన్‌లో ఆదేశాల జారీ చేస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి

పీజీఆర్‌ఎస్‌కు 60 వినతులు



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ పీవో

సీతంపేట: సీతంపేట ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో పాలకొండ సబ్ కలెక్టర్, ఇన్‌చార్జ్ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆధ్వర్యంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సోమవారం నిర్వహించారు. 60 వినతులు వచ్చాయి. అటవీ భూమికి సర్వే చేసి పట్టా ఇప్పించాలని భామిని మండలం బొమ్మికకు చెందిన గణపతి కోరారు. పాఠశాల భవనం మంజూరు చేయాలని లోకొండ గ్రామ గిరిజనులు అర్జీ ఇచ్చారు. వరదగోడ మంజూరు చేయాలని కాంగూడ గ్రామస్తులు విన్నవించారు. కమ్యూనిటీ భవనం నిర్మించాలని కేరాసింగి గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఆటో కొనుగోలుకు రుణం ఇప్పించాలని పాలకొండకు చెందిన చల్లా సుధాకర్ కోరారు. కుట్టు మిషన్ ఇప్పించాలని తాటిమానుగూడ గ్రామస్తురాలు సావిత్రి వినతి ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీవో చిన్నబాబు, ఈఈ రమాదేవి, డీడీ అన్నదొర, డిప్యూటీ ఈవో రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లిని దర్శించుకున్న ఎస్పీ

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, సిరుల తల్లి శ్రీ పైడితల్లి అమ్మవారిని సోమవారం రాత్రి ఎస్పీ ఎఆర్.దామోదర్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, వేద పండితులు ఎస్పీని ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి, వేద ఆశీర్వచనం అందించి, ప్రసాదాలను అందజేశారు. అనంతరం మూడు లాంతర్లు, సిరిమాను తిరిగే ప్రాంతాన్ని సందర్శించారు. ఆయన వెంట అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డీఎస్పీ ఆర్.గోవిందరావు, ఎస్‌బీ సీఐ ఎవి.లీలారావు, సీఐలు టి.శ్రీనివాసరావు, బి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎస్పీ ఎఆర్.దామోదర్

వినతుల పరిష్కారంలో గార్డియన్‌లుగా వ్యవహరించాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి

విజయనగరం అర్బన్: ప్రజల నుంచి వస్తున్న అర్జీలలో అధికంగా రెవెన్యూ శాఖకు చెందినవే ఉన్నాయని వాటిని అధిగమించడానికి సంబంధిత అధికారులు చట్టాలపై పూర్తి అవగాహనతో ఉంటూ వారికి గార్డియన్‌గా వ్యవహరించాలని కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ ప్రగతిపై జిల్లా అధికారులతో కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ మేరకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయికి రావాలసిన దరఖాస్తుదారులు మాత్రమే ఇక్కడికి వచ్చే విధంగా మండల స్థాయిలో సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవోలు, తహసీల్దార్లను ఆదేశించారు. మ్యుటేషన్, 1 బీ నమోదు, భూముల కొనుగోలు, వారసత్వం, ప్రభుత్వ భూమి తదితర స్వరూపాలపై తహసీల్దార్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మాజీ సైనికులకు కేటాయించిన భూములపై నిబంధనలు పరిశీలించి తగిన విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా సేవల విషయంలో ప్రజల సంతృప్తి స్థాయి వారానికి కనీసం 2.5 శాతం వృద్ధి సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ మాట్లాడుతూ కొన్ని పిటీషన్లు 100 రోజుల ఎస్‌ఎల్‌ఏకి మించి సమయం ఉన్నప్పటికీ 15, 20 రోజుల్లోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. సమీక్షలో డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, పీజీఆర్ఎస్ నోడల్ మురళి, జిల్లా అధికారులు, వర్చువల్ విధానంలో ఆర్డీవోలు, మండల తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

జాతీయ సదస్సులో డాక్టర్ అప్పారావు ప్రసంగం

బొబ్బిలి: ఏపీ ఆప్తాల్మిక్ నేషనల్ సింపోజియం నేషనల్ కాన్ఫరెన్స్‌లో ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ కేవీ అప్పారావు గ్లకోమా వైద్యంపై ప్రజంటేషన్ ఇచ్చారు. గుంటూరులో మూడు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఔత్సాహిక కంటి వైద్యులకు దిక్సూచిలా నేత్ర వైద్య రంగంలోని ఆధునిక సాంకేతికతలు, పరిశోధన ఫలితాలను వివరించారు. అలాగే ఒంటి కన్ను ఉన్న వారికి గ్లకోమా సోకితే దానిని త్వరగా నిర్ధారించడం, సరైన చికిత్సనందించే విధానాలను విడమర్చారు. ఇందులోని నూతన పద్ధతులను పవర్ పాయింట్ ప్రజంటేషన్‌పై వివరించారు. ఈ ప్రజంటేషన్‌పై వివిధ రాష్ట్రాల కంటి వైద్య నిపుణులు డాక్టర్ అప్పారావును ప్రశంసించడం విశేషమని స్థానికులు అభినందించారు.